# విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

బుధవారం 11 సెప్టెంబరు 2024 8 పేజీలు


# విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలి

## కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రాస్తారోకో

**విశాలాంధ్ర - ఏలూరు :** విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని, ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని కార్మిక, రైతు సంఘాలు డిమాండ్ చేశాయి.విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పట్ల కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని నిరసిస్తూ కార్మిక సంఘాలు,రైతు సంఘాల ఆధ్వర్యంలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రాస్తారోకో చేపట్టారు. ఏలూరు పాత బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వ హించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్ వీడి ప్రసాద్, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్ద వెంకటరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్టీల్ ప్లాంట్ ను నిర్వీర్యం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. గత మూడేళ్లుగా స్టీల్ ప్లాంట్ ను ప్రైవేట్ పరం చేయాలని మోడీ ప్రభుత్వం విశ్వ ప్రయత్నం చేసిందని,కానీ రాష్ట్ర ప్రజానీకం మద్దతుతో కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారని ఫలితంగా ప్రభుత్వం వెనకడుగు వేసిందన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం పథకం ప్రకారం స్టీల్ ప్లాంట్ ను నష్టాల్లోకి నెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 32 మంది ఆంధ్రుల ప్రాణ త్యాగాల ఫలితంగా ఏర్పడ్డ విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటు వారికి కట్టబెట్టేందుకు మోడీ ప్రభుత్వం దుర్మార్గంగా కుట్రలు చేస్తున్నదని అన్నారు. స్టీల్ ప్లాంట్ ను సెయిల్ లో విలీనం చేయడానికి, సొంత గనులు సమకూర్చడానికి గాని మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. తెలుగుదేశం మద్దతుతో కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వాన్ని చంద్రబాబు నాయుడు స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కనీసం ప్రశ్నించడం లేదన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు బీజేపీపై ఒత్తిడి తెచ్చి స్టీల్ ప్లాంట్ ను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ▶మిగతా 4లో..

## అప్రమత్తంగా ఉండండి

### ఇంజినీరింగ్ అధికారులతో కమిషనర్ సమావేశం

**విశాలాంధ్ర - కాకినాడ :** వరదనీటి ఉధృతిని అంచనా వేస్తూ..ఇంజినీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. భారీ వర్షాలతో గాడేరు, బిక్కవోలు డ్రెయిన్లు, కాలువల్లో వరద నీరు పోటెత్తే సూచనలు ఉన్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో వరదనీటి ప్రవాహన్ని కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం ఉదయం పరిశీలించారు. నగరానికి అనుసంధానంగా సర్పవరం భావన్నారాయణ స్వామి గుడి వద్ద, జనచైతన్య నగర్ బ్రిడ్జి, ప్రతాప్‌నగర్ గాడేరు డ్రెయిన్ పాయింట్లతో పాటు తూర్పు ఏలేరు డ్రెయిన్, బిక్కవోలు డ్రెయిన్లను పరిశీలించారు. వరదనీటి ప్రభావం కాకినాడ నగరానికి లేకుండా చూడాలని నగరపాలక సంస్థ ▶మిగతా 2లో

## పునరావాస కేంద్రాలకు లోతట్టు ప్రజలు

**విశాలాంధ్ర-రాజమహేంద్రవరం రూరల్ :** వాతావరణ శాఖ హెచ్చరికలు, గోదావరికి వరద ఉధృతి నేపథ్యంలో లోతట్టు, ముంపు ప్రాంతాల్లో వారిని సమన్వయ శాఖల అధికారులతో కలిసి రెవిన్యూ, పోలీసు యంత్రాంగం అప్రమత్తమై పునరావాస కేంద్రాలకు తరలింపు, వరద నీరు చేరే మార్గాలలో హెచ్చరికల జారీ చేసి ప్రజలను అప్రమత్తం చెయ్యాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ విడిది కార్యాలయం నుంచి క్షేత్ర స్థాయి సమన్వయ శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్, అంతకు ముందు ఇరిగేషన్ అధికారులతో ఇరిగేషన్ కాలువల తక్షణం మరమ్మత్తులు పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, గోదావరి నది తీర ఎగువ ప్రాంతంలో అధిక వర్షపాతం నమోదు కావడంతో భద్రాచలం, మధ్యప్రదేశ్ , చత్తీస్ ఘడ్ ప్రాంతాల నుంచి వేగంగా వరద నీరు గోదావరి నదికి చేరుతోందన్నారు. ఆమేరకు వాతావరణ శాఖ హెచ్చరికలను చేసిందన్నారు. ప్రస్తుతం గోదావరి నదికి ఎనిమిది లక్షల క్యూసెక్కుల వరద నీరును ధవళేశ్వరం బ్యారేజీ నుండి దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. సాయంత్రం నాటికి మొదటి ప్రమాదక హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని, రానున్న 24 గంటల్లో రెండవ ప్రమాద హెచ్చరిక చేరుకుంటుందని తెలిపారు. ముంపు లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. తగిన ఏర్పాట్లు భోజన వసతి, వైద్య శిబిరం, ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్, నిర్వహించాల్సి ఉంటుందన్నారు. గర్భిణీలు బాలింతలు చిన్నారుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో చేపల వేటకు వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలని, గోదావరిని చూసేందుకు వచ్చే దారుల్లో బారికేడ్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో ఎక్కువగా గణేశ్ నిమజ్జనం ఘాట్లు ▶మిగతా 2లో

## మానవ తప్పిదంతోనే ప్రళయం

### ముంచుకొస్తున్న ప్లాస్టిక్ విలయం

**విశాలాంధ్ర - అమలాపురం :** ప్రకృతి అనేక రూపాల్లో మానవాళికి ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా వారిలో కించిత్ మార్పు రావటం లేదు. ఫలితంగా ప్రతిదానిలో పెరిగిపోయిన నిర్లక్ష్యం మానవాళి మనుగడను ప్రశ్నార్థకం చేసి వారి భవిష్యత్తును అగమ్యగోచరం చేస్తున్నాయి. గతంలో ఎంత భారీ వర్షాలు కురిసినా అరగంట లేదా గంటలో ఆ వర్షం నీరు భూమిలో ఇంకిపోయేవి. ఫలి తంగా ఎంత వర్షం కురిసినా నీరంతా భూమిలో ఇంకిపోవటం వల్ల ప్రకృతి చల్లబడి భూమిలో వేడి తగ్గిపోయి వాతావరణం చల్లగా ఉండేది. అప్పుడు ఇన్ని ఉపద్రవాలు వచ్చేవికావు, ఇన్ని అనర్థాలు జరిగేవి కాదు. ఇటీవల కాలంలో మనుషుల్లో వచ్చిన విపరీత ధోరణులు, మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా ప్రకృతికి పెను ప్రమాదం ముంచుకొస్తోంది. వాతావరణం ఎప్పటికప్పుడు ప్రజలను హెచ్చరిస్తున్న ప్రజల్లో మార్పు కానరావడం లేదు. వర్షం కురిసి కాలికి మట్టి అంటకుండా ప్రతి ఇల్లు వాకిలి ప్రతి సందు గొందు అంతా సిమెంటు రోడ్లు వేయటం వల్ల మన ఇల్లు సమీపంలో బురద అంటని సీసీ రోడ్లు వేయడంతో ప్రమాదకరంగా మారింది. కురిసిన వర్షం నీరు ఎక్కడ దిగాలి, మరి ఎక్కడ భూమిలో ఇంకాలి, అన్న దానికి మానవాళి వద్ద సమాధానమే కరువయ్యింది. ఎక్కడో వూరికి దూరంగా వున్న మురుగు కాలువలు, గోదావరి సముద్రంలోనే దిగాల్సిన దుస్థితి ఏర్పడింది. అంతే తప్ప మనం జీవించే. గ్రామం వూరు పట్టణం మెగా సిటీలో కురిసిన వర్షం దిగి భూమిలో ఇంకిపోయే ఒక్క ప్రదేశం భూతద్దంలో ▶మిగతా 2లో

## మళ్లీ పెరిగిన వరద

**విశాలాంధ్ర - వేలేరుపాడు :** గోదావరి, శబరి నదుల వరద అంతకంతకు పెరుగుతూ పరివాహక ప్రాంతాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గడిచిన మూడు నెలలుగా వరదలు దోబూచులాడుతూ ముంపు బాధితులకు కంటిమీద కునుకు లేకుండా ▶మిగతా 2లో

## వినాయక ఉత్సవ నిమజ్జనాలు ప్రశాంతంగా నిర్వహించాలి

**విశాలాంధ్ర - ముదినేపల్లి:** వినాయక ఉత్సవాలు నిమజ్జన కమిటీ సభ్యులు ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్సై డి.వెంకట్ కుమార్ అన్నారు. నిమజ్జనాల సమయంలో గ్రామాల్లో ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా ప్రశాంతంగా నిర్వహించేలా ప్రభుత్వం మండలస్థాయిలో అధికారులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సమావేశం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్ కె సుభాని ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహాల నిమజ్జనం చేసి గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా వీఆర్వోస్, సెక్రటరీ, సచివాలయం మహిళా పోలీసు బృందంగా ఏర్పడి ఉత్సవాల నిర్వహణకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.మల్లీశ్వరి, విఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఏలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పీఇటిల సమావేశం

**విశాలాంధ్ర-లింగపాలెం:** నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసే కార్యక్రమం ఈనెల 12,13 తేదీల్లో సింగగూడెం పాఠశాలలో నిర్వహించేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు నిర్ణయించారు. దీనికి సంబంధించి ఏలూరు జిల్లా క్రీడా సమైక్య కార్యదర్శి అలివేలు మంగ అధ్యక్షతన ధర్మాజీగూడెం ఉన్నత పాఠశాలలో సమావేశ నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఏడు క్రీడలకు, అథ్లెటిక్స్‌కు క్రీడాకారులను ఎంపిక చేస్తున్నట్లు వీరు తెలిపారు, క్రీడాకారుల ప్రతిభను ఆధారంగా తీసుకొని ఎంపిక ఉంటుందని తెలిపారు. సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రకాష్ రెడ్డి, శ్యామల, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ వరద బాధితులకు రూ.2 లక్షల సహాయం

**విశాలాంధ్ర-భీమవరం:** స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో భీమవరం పెద్ద అమి రంకు చెందిన మహేశ్వరి గ్రూప్స్ అండ్ మహేశ్వరి ఏజెన్సీస్ మేనేజింగ్ డైరెక్టర్ కలిదిండి మురళీ కృష్ణంరాజు విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ అన్నపూర్ణగా పేరుగాంచిన పశ్చిమగోదావరి జిల్లా నేడు వరద బాధితులకు ఆపన్న హస్తం అందించడంలో ముందు వరుసలో ఉందని కొనియాడారు.

## భీమడోలు సిఐగా విల్సన్

**విశాలాంధ్ర-భీమడోలు:** భీమడోలు సిఐగా యుజె.విల్సన్ సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లాలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్‌లో సమర్థ వంతంగా విధులు నిర్వహించిన విల్సన్ బదిలీపై భీమడోలు వచ్చారు. ఈయన గతంలో సర్కిల్ పరిధిలోని ద్వారకా తిరుమల స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహించారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు భీమడోలు, ద్వారకాతిరుమల ఎస్ఐలు, సిబ్బంది స్వాగతం పలికారు.

## జిల్లాలో 94.4 శాతం ఈ-క్రాప్ నమోదు

**విశాలాంధ్ర - ఏలూరు :** జిల్లాలో ఖరీఫ్ పంటకు సంబంధించి ఇప్పటివరకు 4,62,711 ఎకరాలు సాగు చేయగా 4,36,945 ఎకరాలు (94.4శాతం) పంట నమోదు జరిగిందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్ కె హబీబ్ బాషా తెలిపారు.ఖరీఫ్ వరి పంటకు సంబంధించి జిల్లాలో 1,83,489 ఎకరాలు సాగు చేయగా ఇప్పటి వరకు 1,70,032 ఎకరాలు (92.7శాతం) ఈ-క్రాప్ నందు నమోదు జరిగిందన్నారు. మిగిలిన పంట నమోదు ప్రభుత్వం నిర్ధారించిన గడువులోపు పూర్తి చేస్తాం అన్నారు. ఎక్కడైనా పంట నమోదు చేసే ప్రక్రియలో తలెత్తిన సమస్యలను ఎప్పటికప్పుడు పై అధికారులకు తెలియజేసి పరిష్కరిస్తున్నా మన్నారు. ఖరీఫ్‌కు సంబంధించి వరి, పత్తి, అపరాలు, ఇతర పంటల సాగును ఈ పంటలో పంట-నమోదు చేస్తున్నామన్నారు.

# త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

### ఒకరికి తీవ్ర గాయం
### 11 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు

**విశాలాంధ్ర- పాలకోడేరు :** భీమవరంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలకు చెందిన బస్సు మంగళవారం పెనుమంట్ర మండలం మాముదూరు నుంచి దంతుపల్లి, ఆరవల్లి, లక్ష్మీ నారాయణ పురం, మోగల్లు గ్రామాలకు చెందిన సుమారు 20 మంది విద్యార్థులను ఉదయం ఏడున్నర గంటలకు ఎక్కించుకొని భీమవరంలోని కళాశాలకు తరలిస్తుండగా పాలకోడేరు లోని పందొడ్డి ప్రాంతానికి ప్రవేశించగానే బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా అతి వేగంతో నడపడం వల్ల పక్కనే ఉన్న పంట బోదె లోనికి దూసుకుపోయింది. బస్సు వేగానికి అందులో ఉన్న 20 మంది విద్యార్థులు ముందున్న సీట్లకు ఢీకొనడంతో మోగల్లు గ్రామానికి చెందిన సోనాయిల దివ్య సుధా అనే విద్యార్థికి కాలు, చేయి విరిగింది. భవ్య శ్రీ, వర్ధిని, యామిని, మౌనిక లక్ష్మి, అమృత, వర్ష, మాధవి, నవ్య, మోహన్, నికిత అక్షయ, మాధురి లకు స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రమాదం సంభవించిన వెంటనే స్థానికులు హుటాహుటిన స్పందించి గాయపడిన విద్యార్థు లను స్థానిక ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడి కాలు చేయి విరిగిన దివ్య సుధా కు ప్రాథమిక వైద్యాధికారి రంగం నాయుడు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం భీమవరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా గాయపడ్డ విద్యార్థులను మండల తహసీల్దారు నడింపల్లి భారతి విజయ లక్ష్మి, స్థానిక ఎస్సై ఎన్ హరిబాబు,, కళాశాల యాజమాన్యం, పలు పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు పరామర్శించారు. దివ్య సుధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

## పెరిగిన వరద

(1వ పేజీ తరువాయి)

చేశాయి. తగ్గిపోయింది అనుకున్న గోదావరి వరద మంగళవారం మళ్లీ పెరిగింది. దీంతో మండలం లోని కోయిదా, కట్కూరు, నార్లవరం, రుద్రంకోట, రేపాకగొమ్ము తదితర పంచాయతీలోని సుమారు 20 గ్రామలకు వెళ్లే రహదారులు ముంపుకు గురై ఆయా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఆయా గ్రామాలకు పడవల ద్వారా రవాణా సౌకర్యం ఏర్పాటు చేసుకొని అవసరాలను తీర్చుకుంటున్నారు. పంట భూములు ముంపుకు గురై రైతులు సకాలంలో పంటలు నాటే అవకాశం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయంపై ఆధారపడిన కూలీలకు ఉపాధి లేక పూట గడవని పరిస్థితి ఏర్పడింది. గతమెన్నడూ లేని విధంగా ఎడతెరిపి లేకుండా రోజుల తరబడి వర్షం కురవడం ఓవైపు గోదావరి శబరి నదుల వరదలు, మరోవైపు వాగుల వరదలు మండల ప్రజల జీవన విధానాన్ని అస్తవ్యస్తం చేశాయి. గోదావరి ప్రస్తుతం భద్రాచలం వద్ద 48 అడుగులు చేరిందని ఇంకా పెరిగితే మండలం లోని మరిన్ని గ్రామాలకు ముంపు తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అప్రమత్తంగా ఉండండి

(1వ పేజీ తరువాయి)

కమిషనర్ భావన ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. డ్రైన్లలో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ..డ్రెయిన్లలో వరదనీటిని అంచనా వేస్తూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కమిషనర్ వెంట ఎస్ఈ సత్యకుమారి, ఎంహెచ్ఓ పృథ్వీచరణ్ తదితర అధికారులు ఉన్నారు.

## ప్రళయం

(1వ పేజీ తరువాయి)

వెతికినా కానరాదు. విజయవాడ పరిసరాల్లో సంభవించిన వరద బీభత్సం పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. దానికి తోడు ప్లాస్టిక్ వినియోగం ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయి డ్రెన్లు, మురుగు కాల్వలు ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురై చుక్క నీరు దిగే మార్గం లేకుండా మూసేస్తున్నాయి. ఫలితంగా ఎక్కడ కురిసిన వర్షం అక్కడే నిలిచిపోతోంది. మున్సిపాలి టీలు, గ్రామ పంచాయతీలు ఎప్పటికప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలు డ్రైన్లలో పడేయవద్దని హెచ్చరిస్తున్నా చెవిటి వాని ముందు శంఖం ఊదిన చందంగా మారుతోంది. ఫలితంగా ప్లాస్టిక్ వ్యర్థాల గుట్టలు మున్సిపాలిటీ, కార్పొ రేషన్లలో కొండల్ని తలపిస్తున్నాయి. దాని వల్ల వర్షాలు, వరదల వల్ల వూళ్లలోకి వస్తున్న మురుగునీరు వరద ప్రవాహం గ్రామాల్ని ముంచెత్తుతున్నాయి.ఫలితంగా జలప్రళ యం సంభవి స్తుందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నా వినేదెవరు, కాపాడే పర్యావరణ వేత్తలు ఎవరు.

## లోతట్టు ప్రజలు

(1వ పేజీ తరువాయి)

ఉన్నాయని చెప్పారు. నిమజ్జన సమయంలో ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన యంత్రాంగానికి విగ్రహాలు అప్పగించి సహకరించాలని కోరారు. జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు మాట్లాడుతూ, రాజమండ్రి, సీతానగరం, నిడదవోలు, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం తదితర మండలాల్లో ముంపు ప్రాంతాలను గుర్తించడం, అక్కడ నుండి లోతట్టు ప్రాంతాల కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించడం పై దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. సీతానగరం ములకల్లంక , రాజమండ్రి అర్బన్ బ్రిడ్జిలంక, కేతవారిలంక, వెదురు లంక , పల్లి పాలెం తదితర ప్రాంతాల్లో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించడం పై దృష్టి పెట్టాలని ఆదేశించారు.

ఆర్డీవో మాట్లాడుతూ, ఇప్పటికే కలెక్టరు వారి ఆదేశాల మేరగా బ్రిడ్జిలంక, కేతవారిలంక, వెదురు లంక కు చెందిన కుటుంబాలను తరలించామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, ఇరిగేషన్ అధికారులు కె. కాశీ విశ్వేశ్వరరావు, కే రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలి

**విశాలాంధ్ర-లింగపాలెం:** భారీ వర్షాల నేపథ్యంలో గ్రామాలలో పారిశుద్ధ్య పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని లింగపాలెం మండల ప్రత్యేక అధికారి జయప్రకాష్ ఆదేశించారు. మండలంలో నెల కొన్న పరిస్థితులపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంటింటా జ్వరాల సర్వే నిర్వహించాలని కోరారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచటంలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవా లని సూచించారు. గ్రామాలలో మురికి నీరు,చెత్త నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ఇళ్ల మధ్య చెత్త నిల్వ ఉంచే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. గోతులు పడిన రహదారులను పూడ్చేందుకు సంబంధిత అధికారులకు సూచనలు చేసినట్లు ఈయన వివరించారు. అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మండలంలో చేస్తున్న పనులపై ఇన్చార్జి ఎంపీడీవో రత్నకుమార్ సమావేశంలో వివరించారు. రెవిన్యూ శాఖ తరపున చేపట్టిన పనులను తహసీల్దార్ నజీమ్ సమావేశంలో తెలిపారు.

## చిన్నారి ప్రాణానికి కొండంత అండగా నిలిచిన దెందులూరు ఎమ్మెల్యే

**విశాలాంధ్ర- పెదవేగి:** సాటి చిన్నారులతో కలిసి ఆటలాడుకునే వయసులో ఉన్న బాలుడి కుటుంబానికి లివర్ వ్యాధి రూపంలో భారీ కష్టం కలిగింది. తన నియోజకవర్గంలో ఏ వ్యక్తి ఇంటిలో కష్టం వచ్చినా అండగా నిలిచే దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మరోసారి తన మంచి మనసును చాటుకున్నారు. దెందులూరు మండలం సోమవరప్పాడు పంచాయితీ చల్లపల్లి గ్రామానికి చెందిన ఎం.సుదర్శన్ రావు కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. 8సంవత్సరాల వయసు కలిగిన ఆయన చిన్న కుమారుడు జులై నెల నుంచి తీవ్ర అనారోగ్యానికి గురి కాగా పలు ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించారు. లివర్ డ్యామేజ్ అయిందని వైద్యం నిమిత్తం దాదాపు రూ.22 లక్షలు ఖర్చు అవుతాయని వైద్యులు తెలిపారు. కూలి పనులు చేసుకుని జీవించే ఆ కుటుంబం ఈ వార్త విని ఎంతో కుమిలి పోయారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కు స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు బాలుడి పరిస్థితి వివరించారు. చిన్న వయసులో బాలుడు ఎదుర్కొంటున్న ఇబ్బందిని చూసి చలించి పోయిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బాలుడు వైద్యం కోసం రూ.12 లక్షల ఎల్.ఒ.సి.ని బాబు చికిత్స పొందుతున్న హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రి పేరిట మంజూరు చేసి, సంబంధిత పత్రాలను మంగళవారం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో బాలుడు తండ్రికి, కుటుంబసభ్యులకు అంద చేశారు. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకి, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బాలుడు తండ్రి సుదర్శన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి దెందులూరు మండల అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు) సహ పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంచి ఆహారంతో పోషకాహార లోపాల్ని తగ్గించవచ్చు

**విశాలాంధ్ర-ఏలూరు:** మంచి ఆహారంతో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో ఎనీమియా పోషకాహార లోపాల్ని తగ్గించవచ్చని డాక్టర్ బి. బాలకృష్ణ తెలిపారు. అంగన్ వాడీ కేంద్రంలో ఇచ్చే పోషకాహారం గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు ఖచ్చితంగా అందించి ఎనీమియా రాకుండా చూడవచ్చని ఏలూరు సిడిపివో పద్మావతి అన్నారు. ఏలూరు ప్రాజెక్ట్ 3వ నెంబరు గజ్జలవారి చెరువు యుహెచ్ సి నందు మంగళవారం పౌష్టికాహార మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, సూపర్ వైజర్ మీనాక్షి, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కైకరం శివారు అనుసంధాన రహదారుల బాగుకై కదలిన నేతలు

విశాలాంధ్ర - ఉంగుటూరు : మండలంలోనే పేరెన్నికగన్న గ్రామం కైకరం. శివారు గ్రామాల నుండి వంద లాది ప్రజలు తమ దైనందిన పనుల కోసం నిత్యం ఆ గ్రామానికి రాకపోకలు సాగిస్తుంటారు.

అలాంటి గ్రామానికి ఇటీవల కురిసిన వానలు పెద్ద కష్టాన్నే తెచ్చాయి.శివారు గ్రామాలను అనుసంధానం చేసే రహదారులకు ఇరువైపులా పెరిగిన చెట్లు అడ్డుగా విరిగి పడిపోవడం , గుంతల్లో వర్షం నీళ్ళు నిలిచి పోవడంకారణంగా బాటసారులకు, వాహన చోదకులకు చాలా ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. విషయం కైకరం గ్రామ సర్పంచి సలగాల గోపీ, టిడిపి సీనియర్ నాయకుడు ఉంగుటూరు మాజీ జడ్పీటీసీ చింతవాసు దృష్టికి వెళ్ళింది. తక్షణమే సమస్య పరిష్కారానికి ఆ ఇరువురు నేతలు మంగళవారం నడుం బిగించారు. వారి నేతృత్వంలో రహదారుల బాగు కార్యక్రమం నిర్వహించారు. జెసీబీని రప్పించి, వర్షపు నీటి గుంతలు పూడ్చిం చారు. రహదారుల పై గల చెట్ల కొమ్మలు తొలగించారు. కైకరం శివారు గ్రామంలోని వెంకట కృష్ణాపురం, బ్రహ్మానందపురం, రామన్నగూడెం రహదారులు బాగుపడాయి. నేతలు చూపిన చొరవకి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 13,14 తేదీల్లో విజయవాడలో చేనేత బయ్యర్-సెల్లర్ మీట్

విశాలాంధ్ర - ఏలూరు : రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలు, మాస్టర్ వీవర్సు, వ్యక్తిగత చేనేత కార్మికులు తయారు చేసిన చేనేత ఉత్పత్తులను, అమ్మకాలను ప్రోత్సహించేందుకు చేనేత, జౌళి శాఖ కమిషనరు వారి ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో విజయవాడ యం.జీ. రోడ్డు లోని శ్రీశేషసాయి కళ్యాణ వేదిక లో "బయ్యర్ - సెల్లర్" -మీట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి ఎస్. రఘునంద తెలిపారు.ఈ ప్రదర్శనలో రాష్ట్రం లోని అన్ని జిల్లాల నుండి చేనేత, పట్టు సహకార సంఘములు, మాస్టర్ వీవర్సు, చేనేత కళాకారులు తమ ఉత్పత్తు లను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.కావున ఏలూరు జిల్లా లోని వస్త్ర వ్యాపారులు, మాల్స్ షో రూమ్ యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించు కొని చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలని కోరారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ

విశాలాంధ్ర - కలిదిండి: భారీ వర్షాలు కారణంగా పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న బాధితులకు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. మంగళ వారం మండలంలోని పోతుమర్రు పంచాయతీ శివారు ఉప్పుటేరు వెంబడి ఉన్న సున్నంపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంను కామినేని పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బుడమేరు ఉగ్రరూపం దాల్చడంతో కొల్లేరు ముంపునకు గురవుతుందన్నారు. కొల్లేరు నుంచి వచ్చే వర్షపు నీరు కారణంగా ఉప్పుటేరు వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్ర మంలో తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో దినతేజ్ తదితరులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి మంగళవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అతిథి అధ్యాపక పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. యం ఎస్ సి కంప్యూటర్స్ సైన్స్ లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ 55% మార్కులు పొందిన వారు లేక పీహెచ్ డి చేసినవారికి నేషనల్ లెవల్ ఎలిజిబులిటీ టెస్ట్ లో, స్టేట్ లెవల్ ఎలిజిబులిటీ టెస్ట్ కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడునని ఆమె అన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు సంప్రదించాలని ఆమె అన్నారు. సెల్ నెంబర్ 7901056668 అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు.

## పంట నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం అండ

### మంత్రి కొలుసు పార్ధసారధి

విశాలాంధ్ర-ముసునూరు: ముసునూరు మండలం చెక్కపల్లి వెళ్లే రహదారి చింతలవల్లి వద్ద సంధ్యవాగు ఉధృతికి కొట్టుకు పోవడంతో తాత్కాలిక వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గృహనిర్మాణ, సమా చార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి చెప్పారు. మంగళవారం ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న గోగులంపాడు నుంచి చెక్కపల్లి వెళ్లే రహదారి వంతెనను రాష్ట్రమంత్రి కొలుసు పార్ధసారధి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం తాత్కాలిక నిర్మాణ పనులు చేపట్టేందుకు పైపులుకూడా తీసుకువచ్చినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు వచ్చిన వెంటనే శాశ్వత నిర్మాణ కార్యక్రమం చేపడతా మన్నారు. గ్రామంలో కొన్నిచోట్ల డ్రైనేజి సమస్య కనబడిందని పెద్ద వర్షాలు కురవడంతో డ్రైనేజి వ్యవస్థ సరిగ్గా లేని కారణంగా ఇబ్బందులు చోటుచేసుకున్నా యన్నారు. అవసరమైన చోట వెంటనే డ్రైన్లు, కల్వర్టులు నిర్మించడం జరుగుతుందన్నారు. అధికారులు న్యాయబద్ధంగా రైతు నష్టపోయిన ప్రతి సెంటు భూమి వివరాలతో సమగ్ర నివేదిక తయారు చేయాలన్నారు. వీరి వెంట తహశీల్దారు రాజ్ కుమార్, ఆర్ అండ్ బి డిఇ బాబూరావు, ఎఇ అశోక్ బాబు,ఐ.ఓఆర్డి ఎస్ శ్రీనివాసరావు, పలువురు మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చింతలవల్లి గురుకుల పాఠశాల మంత్రి ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-ముసునూరు: ముసునూరు మండలం చింతలవల్లి సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను మంగళ వారం రాష్ట్ర గృహనిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి ఆకస్మిక తనిఖీ చేసారు. గురుకుల పాఠశాలలోని పారిశుధ్యం, వంటగది, టాయిలెట్స్ తదితరాలను ఆయన పరిశీలించారు. హాస్టల్ లోని సమస్యలను విద్యార్థుల నుండి అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌కు వెళ్లే మట్టిరోడ్డును సిసి రోడ్డుగా నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. డైనింగ్ హాలు మరమ్మతుల కోసం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలందరూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని సూచించారు. మంత్రివెంట తహశీల్దారు రాజ్ కుమార్, ప్రిన్సిపాల్ కె. ప్రవీణ తదితరులు ఉన్నారు.

## పంటల నష్టంపై నివేదిక అందించండి

### జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-భీమవరం: భారీ వర్షాల కార ణంగా దెబ్బతిన్న పంట పొలాలను అంచనాలు వేసి సత్వరమే నివేదిక అందించాలని జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళ వారం భీమవరం మండలంలోని చినఅమిరం, యల్.వి.యన్.పురం గ్రామాలలో జిల్లా జాయింటు కలెక్టరు పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీటమునిగి దెబ్బతిన్న వరి పొలాలను సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. జరిగిన పంట నష్టాలను ప్రభుత్వం అందించిన ఫార్మెట్‌లో పూర్తి సమాచారాన్ని పొందుపరిచి నివేదికను జిల్లా కార్యాలయంకు అందించాలన్నారు. విలేజి అగ్రి కల్చర్ అసిస్టెంట్, విఆర్వో, పంచాయతీ కార్యదర్శి ప్రక్రియలో భాగస్వాములై క్షేత్రస్థాయి లోకి రైతులతో కలిసి వెళ్లి డేటా కాలము 34లో నమోదు చేసి నివేదికను అందించాలన్నారు. నష్టాల అంచనాల్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. అనంతరం పల్లిపాలెం బ్రిడ్జి వద్ద కిక్కిసతో నిండిన ప్రాంతాన్ని పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యనమదుర్రు డ్రైను వరద మొదటి ప్రమాద సూచికలో నడుస్తున్న కారణంగా, రెండవ ప్రమాద సూచిక జారీకాక ముందే యుద్ధ ప్రాతిపదికన అవసరమైన ముందస్తు చర్యలను తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా జాయింటు కలెక్టరు వెంట తహసీల్దారు రావి రాంబాబు, వ్యవసాయ సహాయ సంచాలకులు సి.హెచ్. శ్రీనివాసు, మండల వ్యవసాయ శాఖ అధికారి యన్.శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

విశాలాంధ్ర- నూజివీడుటౌన్: సమస్యలు ఉన్నప్పుడు కుంగిపోకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని ఏలూరు జిల్లా వైద్య శాఖ అధికారిణి శర్మిష్ట అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నిరోధక దినోత్సవం సందర్భంగా మంగళవారం నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్వో మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు తమ సమస్యలను ఇతరులతో పంచుకుని పరిష్కార మార్గాలు ఎంచుకోవాలన్నారు. శారీరక, మానసిక ఆర్థికపరమైన ఇబ్బందులు వచ్చినప్పుడు తోటి స్నేహితులు వారిపట్ల శ్రద్ధ వహించి ఓర్పుగా విని పరిష్కార మార్గాలు సూచించాలన్నారు. ఈ కార్యక్రమంలో సైకియాట్రిస్ట్ డాక్టర్ పవిత్ర, సైకాలజిస్ట్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ యూనిట్ల కోఆర్డినేటర్ శ్రావణి కనకకుమారి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పీవీ లక్ష్మణరావు, డాక్టర్ సీతాపతిరావు, జె మధు, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్లు ఏ బ్రహ్మస్వాములు, డాక్టర్ దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

## క్రీస్తుసంఘ పాస్టర్ ఎడ్ల లాజర్ మృతి

విశాలాంధ్ర -ముదినేపల్లి : సుమారు నాల్గు దశాబ్దాల పాటు పాస్టర్ గా ముదినేపల్లి గ్రామంలో సువార్త పరిచర్య చేసి అందరికీ సుపరిచితమైన పాస్టర్ ఎడ్ల లాజర్ (70) మంగళవారం ఆసుపత్రిలో కన్ను మూశారు. సుమారు 60 సంవత్సరముల క్రితం గుంటూరు జిల్లా నుండి సువార్త పరిచర్యను పెదపాలపర్రులో పరిచర్య చేస్తూ వచ్చారు. అక్కడ పాస్టర్ గా పనిచేస్తూ ముదినేపల్లిలో పరిచర్య చేస్తూ వి రావిగుంట , పెదగొన్నూరు గ్రామాల్లో సేవ కొనసాగిస్తున్నారు. అస్వస్థతకు గురైన లాజరును కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పగా ఆయన తుదిశ్వాస విడిచారు.ఆయనకు నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. వివిధ సంఘాలకు చెందిన పాస్టర్లు కుటుంబ సభ్యులను పరామర్శించి భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

## వరద బాధితులకు దుస్తుల పంపిణీ

విశాలాంధ్ర - కలిదిండి: భారీ వర్షాలు కారణంగా విజయవాడ వరద బాధితులకు పూర్వపు విద్యార్థులు దుస్తులు అందజేశారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 1992-93 పదవ తరగతి చదివిన పూర్వపు విద్యార్థులు ఆర్థిక సహకారంతో విజయవాడలోని పాయకాపురం, కండ్రిక ప్రాంతాలలో సుమారు 2 వేల మందికి దుస్తులు, వాటర్ బాటిల్లు, నిత్యావసర సరుకులను కలిదిండి నుంచి ట్రాక్టర్ ద్వారా విజయవాడ వెళ్లి వరద బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులైన పాము .రవికుమార్, మేటపల్లి సోమేశ్వరరావు, పచ్చి గోళ్ళ లలిత ప్రసాద్, వడిగిన దుర్గాప్రసాద్, గొంద్రాల. రాంబాబు, గోదావరి సుబ్రహ్మణ్యం, అత్తులూరి లక్ష్మి, కొండేటి. రాజ భోగేశ్వర రావు, కర్రి నాగలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: గ్రంథాలయాలు విజ్ఞానానికి అలయాలు అని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి సూచించారు. సంస్థలోని గ్రంథాలయాన్ని ఎక్కువగా వినియోగించుకుంటున్న విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బిబ్లియోఫిల్ అవార్డును ప్రకటించారు. దీనిలో భాగంగా 2023-24 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడానికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. అనంతరం సివిల్ ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న సంతోష్ నాయక్, బి.జయేష్ గిరీష్ లకు బిబ్లియోఫిల్ అవార్డులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ కార్తీక్ శేషాద్రి, గ్రంథాలయ చైర్ పర్సన్ డాక్టర్ చేబ్రోలు శ్రీలత, అసిస్టెంట్ లైబ్రేరియన్ కమల మహంతి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌పి కెనాల్‌కు గండి వెంటనే పూడ్చాలి

### ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

**విశాలాంధ్ర-నూజివీడు:** ఎన్. ఎస్.పి. కెనాల్ గండిని తక్షణం పూడ్చాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది.తూర్పు దిగవల్లి ముక్కొల్లు పాడు మధ్యలో ఉన్న ఎన్.ఎస్.పి కెనాల్ కు

గండి పడటంతో రైతు సంఘం, సిపిఐ నాయకులు పర్యటించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏలూరు జిల్లా రైతు సంఘం కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు మాట్లాడుతూ తూర్పు దిగవల్లి, ముక్కొల్లు పాడు మధ్యలో ఉన్న ఎన్.ఎస్.పి. కాలువకు గండి పడటంతో సుమారు 30 ఎకరాలు వరి, మినుము పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, ఎన్.ఎస్.పి. కెనాల్ గండిని వెంటనే పుడ్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కూచిపూడి నాగేశ్వరరావు, నిమ్మగడ్డ నరసింహ, సీపీఐ నాయకులు చాట్ల పుల్లారావు, బాధిత రైతులు ఉన్నం తిరుపతి స్వామి,సహ దేవుడు, పాములూరి పెద్దబ్బాయి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బొర్రంపాలెం ప్రభుత్వాసుపత్రిలో పసికందు మృతి

### వైద్య సిబ్బందే కారణమంటూ బాలింత బంధువుల ఆందోళన

**విశాలాంధ్ర - టి. నరసాపురం :** బొర్రంపాలెం ప్రభుత్వ ఆసుపత్రిలో పసికందు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణ మని బాధితులు ఆరోపించారు. స్థానికులు, బాధిత మహిళ రేఖ తెలిపిన వివరాల ప్రకారం రేఖకు పురిటి నొప్పిలు రావడంతో ఆదివారం రాత్రి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. వైద్యులు పరీక్షించి డెలివరీ అవడానికి సమయం పడుతుందని జాప్యం చేస్తూ వచ్చారని, సోమవారం సాయంత్రం నాలుగు తర్వాత పురుడు వచ్చిందన్నారు. ఆతర్వాత తన బిడ్డను

జంగారెడ్డిగూడెం పిల్లల ఆసుపత్రికి పంపారని అప్పటికే బిడ్డ మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆమె బంధువులు ఆసుపత్రి కి చేరుకుని బిడ్డ మృతికి కారణం వైద్య సిబ్బందే అని, వైద్య సహాయం అందించడంలో నిర్లక్ష్య వైఖరి వల్ల బిడ్డ మృతి చెందిందని ఆందోళనకు దిగారు. ఈ విషయం పై వైద్యురాలు ఇమాంబీని ప్రశ్నించగా బిడ్డకు తల్లి కడుపులోనే పేగు చుట్టుకుని ఊపిరి ఆడక మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం అక్కడకు చేరుకున్న ఎస్ఐ జయకుమార్ వైద్య సిబ్బంది, బాధితులతో చర్చించి సర్ది చెప్పడంతో వారు ఆందోళన విరమించారు పసికందు మృతి పట్ల వైద్యుల నిర్లక్ష్యమే కారణ మని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. పేగులు మెడకు చుట్టుకోవడం వల్లే బిడ్డ చనిపోయిందని వైద్యులు చెబుతున్నప్పటికీ డెలివరీకి ముందు చేసిన స్కానింగ్ లో అలాంటిది ఏమీ లేదని స్కానింగ్ చేసిన వారు చెబుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటన పలు అనుమానా లకు తావిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి సంఘటనపై విచారించి న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

## వరద బాధితులకు విద్యార్థిని విరాళం

**విశాలాంధ్ర-టి నరసాపురం:** విజయవాడలో వరద బాధితులకు సహాయార్థం టి నరసాపురం గ్రామానికి చెందిన పదోతరగతి విద్యార్థి రేఖాంబిక 7 వేలు విరాళాలు సేకరించి మంగళవారం పాఠశాల

యాజమాన్యానికి అందజేశారు. టి నరసాపురానికి చెందిన మండం ఆదిత్య కుమార్, పుష్ప మాదవి దంపతుల కుమార్తె రేఖాంబిక విరాళాలు సేకరించి తాను కొంత నగదు చేర్చి మొత్తం 7వేలను తాను పదోతరగతి చదువుతున్న చింతలపూడి భాష్యం స్కూల్ యాజమాన్యానికి అందజేశారు. విద్యార్థులు విద్యతో పాటు సేవా దృక్పథం కలిగి ఉండడం అభినంద నీయమని పాఠశాల యాజమాన్యంతో పాటు గ్రామానికి చెందిన పలువురు పెద్దలు విద్యార్థినిని అభినందించారు.

## ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలి

(1వ పేజీ తరువాయి)

రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, కిసాన్ సెల్ నాయకులు రాజనాల రామ్మోహనరావు మాట్లా డుతూ లక్ష మంది కార్మికులకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి చూపిస్తూ, మూడు లక్షల కోట్ల సంపద కలిగిన స్టీల్ ప్లాంట్ ను ప్రవేటు వారిని కట్టబెట్టాలని చూస్తే రాష్ట్రంలో ఉన్న రైతులు కార్మికులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటియుసి నాయకులు కే. కృష్ణమాచార్యులు,అప్పలరాజు,పుప్పాల శ్రీనివాసరావు, ఉప్పులూరి హేమ శంకర్, కడుపు కన్నయ్య,బి. కె.ఎం.యు. నాయకులు బి ప్రభాకర్,ఎ. మోహన్, చింతపల్లి కూర్మారావు,బి. నాగేశ్వరరావు, ఎస్.ఎం.వి. సుబ్బారావు,ఎ. లక్ష్మీ ఇందిర,ఎ,చిన్ని, ఐఎఫ్టియు నాయకులు వై. శ్రీనివాసరావు, ఎం.అప్పారావు, పి గంగరాజు జి రమణ, బి. నాగేశ్వరరావు, సిఐటియు నాయకులు బి. సోమయ్య, వివిఎన్ ప్రసాద్,జి రవి కిషోర్, కే పోసమ్మ, వైయస్ కనకారావు, కె .విజయలక్ష్మి, కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులు తాళ్లూరి చక్రవర్తి, దారం మోహనరావు, కే వెంకటేశ్వరరావు, సేవాదళ్ సుబ్బారావు, వై. రాటాలు,తదితరులు నాయకత్వం వహించారు.

**చింతలపూడిలో :** కార్మిక సంఘాల రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు చింతలపూడి పట్టణ కేంద్రంలో ఏఐటీయూసీ,సిఐటియు,ఎఐకె కెవెస్, ఆధ్వర్యంలో బోసు బొమ్మ సెంటర్లో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని

ప్రైవేటీకరణ ఆలోచన విధానాన్ని విరమించుకోవాలని కార్మికులు పెద్ద ఎత్తున నిరసన, రాస్తారోకో చేపట్టారు.ఈ కార్యక్రమానికి ఏఐటియుసి ఏలూరు జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తొర్లపాటి బాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.వి.ఎస్. నారాయణ నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కె.బుచ్చిబాబు, ఎఐకెకెఎస్. రైతు సంఘ నాయకులు డి. రంగనాథ్, సిఐటియు సీనియర్ నాయకులు ఎస్. సూర్యకుమార్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖపట్నం ఉక్కు కర్మగారాన్ని కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్లు ఖరీదు చేసే ఈ కర్మగారాన్ని కారుచౌకగా తమ అనుయాయులకు వేలకోట్లకు కట్టబెట్టదానికి నిరశనగా తెలుగు ప్రజలు అడ్డుకోవాలని పిలుపు నిచ్చారు. సిపిఐ మండల కార్యదర్శి కె.గురవయ్య కార్మికులకు మద్దతు తెలియజేశారు.ఈ కార్యక్ర మంలో హమాలీ సంఘం నాయకులు కంపసాటి అప్పారావు ,రాను బోయిన వెంకటేశ్వరరావు ,కె.వీరబాబు,ఎస్.కె. వలి,డి. రమేష్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు డి.సత్యనారా యణ తదితరులు పాల్గొన్నారు.

**కామవరపుకోటలో :** కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలను ఉపసంహరించుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కుపై ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీ

కరణ విధానాలను నిరసిస్తూ మంగళవారం సిపిఐ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో కామవరపుకోట-ఏలూరు ప్రధాన రహదారిపై రాస్తారోకో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినదించి ఎందరో పోరాట యోధులు ప్రాణత్యాగం చేసి సాధించుకున్న ఉక్కు పరిశ్రమలో ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కోటిగంటి సోమరాజు, ముఠా యూనియన్ నాయకులు ఎన్న భీమయ్య, ఆర్ బాలరాజు, దుర్గాప్రసాద్, గోవిందరాజు, వెంకన్న, శేషం రాజు, తదితరులు పాల్గొన్నారు.

**నూజివీడు టౌన్‌లో :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలు,విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే కార్మిక,రైతాంగ, ప్రజా వ్యతిరేక,

కార్పొరేట్ అనుకూల విధానాలకు స్వస్తి పలకాలని కార్మిక సంఘాలు,రైతు సంఘాల రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నూజివీడు చిన్నగాంధీ బొమ్మ సెంటర్లో ఏఐటీయూసీ, సీఐటీయూ, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ ను కార్పొరేట్లకు అప్పగిస్తే ప్రభుత్వం పతనం తప్పదని, విశాఖ స్టీల్ కు గనులు కేటాయించి ప్రభుత్వ రంగ సంస్థ గానే ఉంచాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ లో ఉన్న ఒకే ఒక్క భారీ పరిశ్రమ స్టీల్ ప్లాంట్ అని దీని ప్రవేటీకరణ వెంటనే ఆపాలని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కోసం సుమారు 1000 రోజులకు పైగా రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తుంటే కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నిరెత్తినట్లుగా ఉండటం సరికాదన్నారు.విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకై అందరినీ కలుపుకొని భవిష్యత్తులో ఐక్య పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ కార్యదర్శి జి. రాజు మాట్లాడుతూ గత 10 ఏళ్ల కాలంలో మోడీ అనుసరించిన కార్పొరేట్ అనుకూల విధానాలు భారతదేశంలో పేదరికాన్ని పెంచిందని, నిరుద్యోగం పెద్దఎత్తున పెరిగిందని, అసమానతలు విపరీతంగా పెరిగి ప్రజల ఆదాయాలు పడిపోయాయని,రైతుల ఆత్మహత్యలు రెట్టింపయ్యా యని విమర్శించారు. రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి రాయకుల లక్ష్మణరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు విభజన చట్టంలోని హామీలో భాగంగా కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కూచిపూడి నాగేశ్వరరావు, గిరీష్, ఆనంద్, ఏఐటీయూసీ ముఠా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కే కృష్ణ, నాయకులు టి. సత్తిబాబు,కే రామ్మూర్తి, ఎల్ అప్పలనాయుడు,టి సన్యాసి నాయుడు,ఒగ్గు ముఖర్జీ, సిఐటియు నాయకులు ఎన్ హనుమాన్లు, మరియ దాసు, శోభనాద్రి తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్షుడిగా రాజనాల నియామకం

**విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు :** ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రాజనాల రామ్మోహన్ రావుని నియమిస్తూ పిసిసి అధ్యక్షురాలు వైయస్.షర్మిల నియామకు ఉత్తర్వులు జారీ చేయడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. గత మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ తనదైన శైలిలో జిల్లా కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయి బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసిన అభ్యర్థుల గెలుపుకు తనవంతు పాత్ర పోషించారు. పిసిసి పిలుపులో భాగంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీని ముందుకు నడిపిస్తూ వచ్చారు. డిసిసి అధ్యక్షులుగా గతంలో ఎంతో మంది పనిచేసిన ప్పటికీ రాష్ట్ర విభజన అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర రాష్ట్రంలో, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఉనికి కోల్పోయినప్పటికీ వెనుకంజ వేయకుండా కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాలను నిర్వహిస్తూ తన వంతు పాత్ర పోషిస్తూ వచ్చారు. ఈ తరుణంలో రామ్మోహన్ రావు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేసిన కృషిని గుర్తించిన పిసిసి అధిష్టానం తిరిగి మరో మారు రెండవసారి రాజనాలకు డీసీసీ అధ్యక్షునిగా పదవిని అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రేపు విజయవాడలో జరగబోయే పిసిసి తొలి అంతర్గత సమావేశానికి

డిసిసి అధ్యక్షులు హోదాలో రాజనాల రామ్మోహన్ రావు హాజరవుతున్నారు. డిసిసి అధ్యక్షునిగా ఎంపికైన రాజనాలకు ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నేతలు అభినందనలు తెలిపారు.

**CHANGE OF NAME**

I, KALABATHULA RAJU, S/O K.Venkata Rao., Resident of D. No.3-217, Grace goyal nagar, Rustumbada, Narasapur, West Godavari District, A.P-534275. I have changed my name from KANABATHULA RAJU (Old Name) To **KALABATHULA RAJU** (New name) for all practical purposes.

## కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేలకు సత్కారం

**విశాలాంధ్ర -భీమవరం:** సీనియర్ సిటిజన్స్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ ధ్వర్యంలో కేంద్ర భారీ, ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజ నేయులుకు మంగళవారం ఆత్మీయ సత్కారం చేశారు. ఈ

సందర్భంగా కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ ఫోరం చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. వయో వృద్ధులకు కరోనా సమయంలో తీసివేసిన రైల్వే ఛార్జీల లో రాయితీ పునరుద్ధరించాలని, తల్లిదండ్రుల, వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం -2007నకు స్టాండింగ్ కమిటీ ఆమోదించిన సవరణ బిల్లును పార్లమెంటులో ఆమోదింపజేయాలని, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ నిధి ఏర్పాటు చేసి వారి సంక్షేమం కొరకు గ్రాంట్ మంజూరు చేయాలని, జిల్లా కేంద్రం భీమవరంను అభివృద్ధి చేయాలని సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన అధ్యక్షులు కొటిక లపూడి గోవిందరావు, ఫోరం అధ్యక్షులు నల్లం వెంకట కృష్ణనాగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగూడెం చెరువును పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర- దేవరపలి ్ల: దేవరపల్లి మండలం ఎర్రగూడెంలోని గండి చెరువును జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ అధిక వర్షాలు వల్ల చెరువులు కాలవలకు పడిన గండ్లను వెంటనే గుర్తి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశతోష్ శ్రీ వాస్తవ దేవరపల్లి తహశీల్దార్ రాజ్యలక్ష్మి , ఎంపీడీవో ప్రభాకర్ రావు,ఆర్ఐ వెంకటేశ్వరరావు,కార్యదర్శి రాణ, వీఆర్వోలు పాల్గొన్నారు

## వరద బాధితులకి తిరుమల విద్యాసంస్థల విరాళం



విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : విజయవాడ వరద బాధితులకు తమ వంతు సహాయంగా తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమల రావు రూ.50 లక్షల చెక్కును ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి విజయవాడలో అందజేశారు. తమ స్టాఫ్, విద్యార్థులు సహకారంతో మరో రూ.50 లక్షలు అందజేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లుగా తెలిపారు. వరద బాధితులకు తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 20వేల ఆహార ప్యాకెట్స్ ,వాటర్ ప్యాకెట్లు తమ విద్యా సంస్థలు తరపున పంపించినట్టు ఈ సందర్భంగా తెలియజేశారు.

## జలదిగ్బంధంలో పిఠాపురం జాతీయ రహదారి

విశాలాంధ్ర - పిఠాపురం : మొన్న కురిసిన వరదలకు ఏలేరు ప్రాజెక్టు వరద నీటితో నిండిపోవడంతో మంగళవారం ప్రాజెక్టు గేట్లు ఎత్తారు. ఆ వరద నీరు రోడ్డుపై ప్రవహించడంతో రాపర్తి రోడ్, గొల్లప్రోలు, భోగాపురం అంతా జలమయమై పిఠాపురం జాతీయ రహదారి 214 పైకి వచ్చేసింది. జాతీయ రహదారి అంతా జలదిగ్బంధమైంది. దీంతో కాకినాడ నుంచి కత్తిపూడి వైపు వెళ్ళే ద్విచక్ర వాహనదారులు ఎటూ వెళ్లలేని స్థితిలో ఇబ్బంది పడుతున్నారు. భారీ వాహనాలు తప్ప చిన్న వాహనాలు ఏవి కూడా నీటి ఉధృతికి వెళ్లలేని స్థితిలో వున్నాయి. రంగంలోకి దిగిన అధికార యంత్రాంగం ట్రాఫిక్ మళ్లించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఇప్పటికే సుమారు పది కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు.

## వరద బాధితులకు విశ్వం వాయిస్ రిపోర్టర్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర - అమలాపురం : విజయవాడ వరదల్లో చిక్కుకుని సర్వం కోల్పోయిన బాధితులకు అమలాపురం మండలం జనుపల్లి గ్రామంలోని వ్యాపార సంస్థ శ్రీ గణేష్ కిరాణా (కుప్పాల బ్రదర్స్), కుప్పాల వీర వెంకట సత్యనారాయణ (శ్రీను), కుప్పాల రామకృష్ణ, కుప్పాల వేంకటేశ్వరరావు (బుజ్జి), సీఎం సహాయ నిధికి రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. మంగళవారం ఉదయం కలెక్టర్ ఛాంబర్లో జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్‌కు 50వేల రూపాయల చెక్కును అందచేశారు. కుప్పాల బ్రదర్స్‌లో ఒకరైన వెంకటేష్ విశ్వం వాయిస్ దిన పత్రికలో రిపోర్టర్‌గా పని చేస్తూ వారి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విశ్వం వాయిస్ చైర్మన్ సునీల్ కుమార్ మన సంస్థ తరపున వరద బాధితులకు మనమందరం అండగా నిలవాలని కోరారు. వరద బాధితులకు సాయం చేయటానికి ముందుకు వచ్చిన విశ్వం వాయిస్ రిపోర్టర్ వెంకటేష్‌కి విశ్వం వాయిస్ సంస్థ చైర్మన్ సునీల్ కుమార్ అభినందనలు తెలియజేసారు.

## గొల్లప్రోలులో ముంపు బాధితుల నిరసన

విశాలాంధ్ర - గొల్లప్రోలు : పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు పట్టణం ఎస్సీ కాలనీలో ఇళ్లలోకి నీరు చేరినా పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత ప్రజలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో తమ ప్రాంతం ఉన్నా స్థానిక అధికారులు చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిండా మునిగి ఉన్న తమను పట్టించుకునే నాథుడే కరువయ్యారని రోడ్డెక్కి నిరసన చేపట్టారు.

# ఏలేరు ఉధృతికి నీట మునిగిన గ్రామాలు

- చెరువులను తలపిస్తున్న రహదారులు
- రాకపోకలకు అడ్డంకులు
- ఇళ్లలోకి చేరిన నీరు
- పునరావాస కేంద్రాల ఏర్పాటు

విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి : ఏలేరు ఉధృతికి కిర్లంపూడి మండలంలోని గ్రామాలు నీట మునిగాయి. రహదారులు సైతం చెరువులను తలపిస్తుండటంతో రాకపోకలకు అడ్డంకులు ఏర్పడ్డాయి. మండలంలోని ఎస్ తిమ్మాపురం, శృంగరాయునిపాలెం, భూపాలపట్నం, వీరవరం ముక్కోల్లు, రాజుపాలెం, పాత కృష్ణవరం, గ్రామాల్లోకి నీరు చేరడంతో ఆయా గ్రామాల లోతొట్టు ప్రాంత ప్రజలు బిక్కు బిక్కుమంటూ జీవిస్తున్నారు. ఇళ్ళ లోకి నీరు చేరడంతో వారు బయటకు వచ్చే మార్గం లేక ఇబ్బందులు పడుతున్నారు. జగ్గంపేట మండలం రామవరం కిర్లంపూడి మండలం గోనెడ గ్రామాల మధ్య కండి కాలువ పొంగి నీరు రహదారిపై నుండి ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే రాజుపాలెం, వీరవరం గ్రామాల మధ్య, రాజుపాలెం, ముక్కోల్లు గ్రామాల మధ్య, బూరుగుపూడి, సోమరాయణంపేట గ్రామాల మధ్య రహదారులపై నుండి నీరు ప్రవహించడంతో ఆయా గ్రామాల రాకపోకలకు అడ్డంకులు ఏర్పడ్డాయి.

**పునరావాస కేంద్రాల ఏర్పాటు :** మండలంలోని గెద్దనాపల్లి, సోమవరం, శృంగరాయునిపాలెం, భూపాలపట్నం, రాజుపాలెం, ముక్కోల్లు గ్రామాల్లో సురక్షిత ప్రాంతాలను అధికారులు ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంత వాసులను ఆయా సురక్షిత ప్రాంతాలకు తరలించి నాయకులు సహకారంతో భోజనం, వసతి సౌకర్యాలను కల్పిస్తున్నారు.

## వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### కలెక్టర్ మహేష్ కుమార్

విశాలాంధ్ర - మామిడికుదురు : గోదావరి నది వరద హెచ్చరికలు నేపథ్యంలో లంక గ్రామ వాసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని అప్పనపల్లి మార్గమధ్యంలో ఉన్న కాజ్వే వద్ద వరద ప్రవాహ స్థితిగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ప్రవాహం ఉధృతంగా ఉన్న సమయంలో కాజ్ వేను పూర్తిగా మూసివేసి ప్రక్కనే ఉన్న నూతనంగా నిర్మించిన వంతెన పై ట్రాఫిక్‌ను మళ్ళించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కేశవర్ధన రెడ్డి, తహశీల్దార్ మృత్యుంజయరావు, ఆర్‌ఐ ఎంవి ఆలీ, జడ్పిటిసి అంజిబాబు, అప్పనపల్లి సర్పంచ్ మంగాలక్ష్మి, పాశర్లపూడి సర్పంచ్ ప్రేమాజ్యోతి పాల్గొన్నారు.

## పి గన్నవరం సీఐగా భీమరాజు

విశాలాంధ్ర - అమలాపురం : పి గన్నవరం సీఐగా ఆర్ భీమరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన మారేడుమిల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. కోనసీమలో అమలాపురం రూరల్, పట్టణ సిఐగా, అయినవిల్లి, అల్లవరం, ఉప్పల గుప్తం, అంబాజీపేట ఎస్ఐగా భీమరాజు పని చేశారు. పి గన్నవరం సిఐగా పని చేస్తున్న ప్రశాంత్ కుమార్‌ను జిల్లా ఎస్పీ కార్యాలయంలో రిపోర్ట్ చేయమని ఆదేశాలు జారీ చేశారు. మంచి అధికారిగా భీమరాజు నియామకంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

## కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి సమష్టి కృషి

### - డీసీసీ అధ్యక్షులు డాక్టర్ టీకే విశ్వేశ్వర రెడ్డి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : అఖిల భారత కాంగ్రెస్ పార్టీకి తూర్పుగోదావరి జిల్లాలో పూర్వ వైభవం వచ్చేందుకు సమిష్టి ప్రణాళికతో కృషి చేస్తానని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ టీ.కే. విశ్వేశ్వర రెడ్డి వెల్లడించారు. తాజాగా తొలిసారిగా ఆయన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం స్థానిక పేపర్ మిల్లు ఎదురుగా ఉన్న శ్రీ కృష్ణ సాయి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేసేందుకు వీలుగా తూర్పు గోదావరి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తానని చెప్పారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రెడ్డి నేతృత్వంలో అందరూ సమన్వయంతో పని చేస్తామని తెలిపారు. ఈ మేరకు విశ్వేశ్వర రెడ్డి తో మూడో సారి రాజమండ్రి నగర కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైన బాలే పల్లి మురళీధర్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. నూతనంగా నియమితులైన పీసీసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ అరిగెల అరుణ కుమారి, పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, తదితరులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు కాంగ్రెస్ సైనికుల వలె కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అన్ని మతాల, అన్ని వర్గాల పార్టీగా పొందిన ఖ్యాతిని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు వచ్చే నెల ఐదున మున్సిపల్ కాలనీ లో బృహత్తర రీతిలో విశాలమైన తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని నెలకొల్పుతున్నట్లు వెల్లడించారు.

విలేకరుల సమావేశంలో నగర కాంగ్రెస్ నూతన అధ్యక్షులు బాలే పల్లి మురళీధర్, డిసిసి మాజీ అధ్యక్షులు అరిగెల అరుణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు బెజవాడ రంగారావు, అబ్దుల్లా షరీఫ్, దేవత సుధాకర్, కిషోర్ జైన్, డాక్టర్ వడయార్, మహిళా కాంగ్రెస్ ప్రెసిడెంట్ మోతా శారద, డాక్టర్ శ్రీనివాస్, బత్తిన చంద్ర రావు, లీలావతి, పట్నాల శ్రీనివాస్, బిల్డర్ చిన్న, బీవీ భాస్కర్, ఎండి షహ్నా, చిన్నం మురళీకృష్ణ, జిపిఎన్ బాబ్జి, రామకృష్ణ దోసపాటి సత్య ప్రసాద్, బర్రే సుబ్రహ్మణ్యం, జి రామ రాయుడు, నల్ల వీర్రాజు, తడాల కొండబాబు, పి సత్యనారాయణరాజు, బత్తిన చంద్రరావు, ముప్పిడి శ్రీనివాసు, వి రామారావు, దేవాని చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# వరి పొలాలు పరిశీలించిన ఏరువాక అధికారులు

విశాలాంధ్ర - రాజానగరం,సీతానగరం : ఇటీవలే కురిసిన వర్షాల దాటికి,ఏగువ నుండి వచ్చిన నీటి ఉధృతికి ముంపు భారిన పడిన వరి పొలాలు ఏరువాక అధికారులు మంగళవారం పరిశీలించారు. రాజానగరం నియోజకవర్గ పరిధిలోని కోరుకొండ మండలం శ్రీరంగపట్నం, రాఘవపురం, నాగంపల్లి, సూరంపాలెం, మునగాల, కోటికేశవరం గ్రామాల్లోని పంట పొలాలను పరిశీలించిన ఏరువాక కేంద్రం తూర్పు గోదావరి జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ కోరుకొండ మండలాల్లోని పై గ్రామాల్లో వరి పొలాల్లో కొద్ది మేర ప్రభావం కనిపించిందనీ, సుమారు 200 ఎకరాల వరి పంట పాక్షికంగా ముంపుకు గురైందని, 60 ఎకరాలు పూర్తిగా నీటి మునకలో ఉందన్నారు. ఇటీవల వర్షాల వల్ల, స్థానిక సూరంపాలెం మురికి కాలువ పోటెత్తడంతో అదనపు నీరు వరి పంటను ముంచినట్లు చెప్పారు.పొలాల నుండి నీరు బయటకు పోకపోవడం వల్ల, అక్కడక్కడా పంట మునిగినట్లు చెప్పారు. రైతులు ఆందోళన పడవద్దని చెప్పారు.ముంపు ప్రాంతాల్లో మాగుడు తెగులు కనిపించదనీ, ఉధృతి పెరగకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ ఏడిఏ బి.కె మల్లికార్జున రావు, జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ జయ రామ లక్ష్మి, వ్యవసాయ అధికారి గౌరిదేవి, ఆత్మా ఏటి ఎం జె.జయశ్రీ, వివి ఏ దేవి ప్రసాద్, వ్యవసాయ అధికారులు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

బుధవారం 11 సెప్టెంబరు | 2024

## ఎర్రవరం గ్రామాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సత్యప్రభ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలకు ఏలేరు జలాశయంకు అధిక మొత్తంలో వరద నీరు వచ్చి చేరుకోవడంతో ఏలేరు అధికారులు సుమారు 27 వేల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. దీంతో ఏలేరు వరద నీటి ఉధృతికి మండలంలోని ఎర్రవరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎమ్మెల్యే సత్యప్రభ సోమవారం రాత్రి ఏలేరు ముంపునకు గురైన గ్రామస్తులను పరామర్శించారు. వరద నీరు ఇళ్లను చుట్టు ముట్టడంతో అధికారులు ముంపు బాధితులను స్థానిక పాఠశాలలో పునరావాస కేంద్రంగా తాత్కాలిక వసతి ఏర్పాటు చేశారు. అక్కడకి వెళ్లి వారందరిని పరామర్శించి ఎమ్మెల్యే వారికి భోజనాలు, రొట్టెలు, త్రాగు నీరు అందజేశారు. ముంపు బాధితులకు ఎటు వంటి అవసరం వచ్చిన అధికారులు, స్థానిక నాయకులు వెంటనే స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నీటమునిగిన పొలాలను పరిశీలించిన అధికారి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండలంలోని యర్రవరం గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ విజయకుమార్ మంగళవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు ఎవరు అధైర్యపడవద్దని రైతులకు అండగా ప్రభుత్వం ఉందని, వరద ఉధృతి తగ్గిన వెంటనే తమ సిబ్బంది పంట పొలాలను సందర్శించి నష్టాన్ని అంచనా వేయడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి), యర్రవరం టీడీపీ నాయకులు బస్వా మహాలక్ష్మి ప్రసాద్, మండల రెవెన్యూ అధికారి ఆర్వి వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి బి జ్యోతి, పెద్దనాపల్లి, తిరుమాలి, సి రాయవరం, గ్రామలలో పంట పొలాలను సందర్శించి రైతులకు తగు జాగ్రత్తలు చెప్పి సూచనలు సలహాలు ఇచ్చారు.

## డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

విశాలాంధ్ర - జగ్గంపేట : మండల కేంద్రమైన జగ్గంపేట మెయిన్ రోడ్డులో జనసేన నాయకులు ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామ ఉప సర్పంచ్ బాలు మాట్లాడుతూ ప్రతి మంగళవారం ఈ క్యాంటీన్ ద్వారా పేదలకు ఆహారం అందించడం మంచి కార్యక్రమం అన్నారు. నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ అధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు నుండి ఈ కార్యక్రమం మొదలు పెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మాదారపు వీరబాబు, సూరపురెడ్డి నరేష్, గోపి స్వామి, రేవూరి శ్రీను, పితాని వీరబాబు, రామకుర్తి బ్రహ్మాజీ, శ్రీనివాస్, సూరా బత్తులు వీరబాబు, రాజనాల శ్రీను, పోలిశెట్టి రాజన్న, ఓంకార్, అనుసూరి దుర్గా రావు ఉన్నారు.

## పాఠశాలకు నూతన ప్రింటర్ బహుకరణ

విశాలాంధ్ర - ఆలమూరు : చెముడులంక ఎస్సీఎస్ఎస్ఎమ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 199-92 బ్యాచ్‌లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం నూతన ప్రింటర్‌ను అందజేశారు. గతంలో ఈ పూర్వ విద్యార్థి బృందం పాఠశాలలో తమ ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్న సందర్భంలో స్కూల్‌కి బహుకరించిన ప్రింటర్ పాడైపోయిందని తెలియడంతో రూ.20వేలతో నూతన ప్రింటర్‌ను కొనుగోలు చేసి అందజేశారు. దీనితోపాటు తమ బ్యాచ్‌కు చెందిన సహచర మిత్రుడు హఠాన్మరణం చెందాడని తెలుసుకున్న పూర్వవిద్యార్థి బృందం రూ.60 వేలను సేకరించి దివంగత మిత్రుడి పిల్లల పేరు మీద పోస్ట్ ఆఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. పూర్వ విద్యార్థి బృందాన్ని ప్రిన్సిపల్, పాఠశాల విద్యాకమిటీ, పలువురు నాయకులు అభినందించారు.

## గణేష్ నిమజ్జనాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - సీతానగరం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ రమేష్ అధ్యక్షతన అధికారుల సమావేశం నిర్వహించారు. దీనిలో రాబోయే రోజుల్లో గణపతి నిమజ్జనాలు జోరు అందుకుంటాయని కావున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సాధ్యమైనంత వరకు గణపతి నిమార్జనాలు ఉదయం నుండి మధ్యాహ్నం 12 గంటల లోపు పూర్తి అయేలా చూడాలని సూచించారు. నిమర్జనాలు ప్రదేశాల పై దృష్టి సారించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలలో పోలీస్ సిబ్బంది సహకారం తీసుకోవాలని కోరారు.

## కొవ్వూరులో పౌష్టికాహార మహోత్సవాలు

విశాలాంధ్ర - కొవ్వూరు : కొవ్వూరు పరిధిలోని యానాది కాలనీ అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహార మహోత్సవం అంగన్వాడి సూపర్వైజర్ ఉదయభాను ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో తల్లి ఆరోగ్యకరమైన పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వలన ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మని స్తారని, ప్రసవం సమయంలో తల్లి చక్కటి ఆరోగ్యంగా ఉంటారన్నారు.బిడ్డకు తల్లిపాలు చక్కటి పోషణలు అందిస్తాయని ఆరు నెలల పాటు తల్లిపాలు బిడ్డకు తప్పనిసరిగా అందించాలని కొవ్వూరు అంగన్వాడి ప్రాజెక్టు అధికారి మమ్మీ అన్నారు. ఈ కార్యక్ర మంలో అంగన్వాడి వర్కర్స్, నిర్మల మంజు భార్గవి హెల్పర్స్ దుర్గాభవాని, తల్లులు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## తెలుగుజాతి కీర్తి శిఖరం ఎన్టీఆర్

### జాతీయ కవితా పోటీలలో టాప్ టెన్ విజేతగా డాక్టర్ సుబ్బారావు

విశాలాంధ్ర - కొత్తపేట : తెలుగుజాతి కీర్తి శిఖరం ఎన్టీఆర్ అనే శీర్షికపై జాతీయ కవితా పోటీల్లో కొత్తపేటకు చెందిన అధ్యాపకుడు పాత్రికేయుడు కవి డాక్టర్ వివివిఎస్ సుబ్బారావు టాప్ టెన్ విజేతగా నిలిచారు. సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళా వేదిక జాతీయస్థాయిలో తెలుగు జాతి కీర్తి శిఖరం ఎన్టీఆర్ అనే శీర్షికతో కవిత పోటీలు నిర్వహించారు. ఈనెల నాలుగవ తేదీన పోటీలు ముగియగా, 9వ తేదీన కవితా పోటీల ఫలితాలు ప్రకటించారు. సుమారు నాలుగు వందల మందికి పైగా కవులు పోటీ పడగా టాప్‌టెన్ విజేతగా సుబ్బారావు ఎంపికైనట్లు కవిత పోటీల నిర్వాహకులు తెలిపారు. ఆ మేరకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమాదేవి, జిల్లా కన్వీనర్ జాతీయ అధ్యక్షురాలు జి ఈశ్వరి, భూషణం, జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టె లలిత, జాతీయ కో ఆర్డినేటర్ నూక సంపత్, జాతీయ సోషల్ మీడియా ప్రతినిధి నల్లా భాగ్యలక్ష్మి, శ్రీశ్రీ కళావేదిక జిల్లా కన్వీనర్ బివివి సత్యనారాయణ, అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి సుబ్బారావును అభినందించారు.

## పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల నియంత్రణ

విశాలాంధ్ర - ఆలమూరు : దోమల నివారణతో వ్యాధుల నియంత్రణ సాధ్యమని గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు అన్నారు. మంగళవారం గ్రామంలో చొప్పెల్ల పిహెచ్సి వైద్య సిబ్బందితో కలిసి జ్వర సర్వే నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు జ్వరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కాచిన నీరు త్రాగాలని వైద్య సిబ్బంది సూచించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మాత్రలు పంపిణీ చేశారు.

## వరద ఉధృతిపై ఎంపీడీవో సమావేశం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : వరద ఉధృతి ఎక్కువగా ఉండుట వలన ధవళేశ్వరం వద్ద మంగళవారం సాయంత్రానికి మొదటి హెచ్చరిక జారీ చేస్తారు అని, అలాగే గురువారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారని జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలియజేసారు. సెక్రటరీలు, వీఆర్వోలు సచివాలయ సిబ్బందితో అందరు సమన్వయం చేసుకుంటూ రాబోయే 48 గంటలు ఎవ్వరూ హెడ్ క్వార్టర్స్ దాటి వెళ్లకుండా, ప్రజలను ఎలర్ట్ చేస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా పశువుల కోసం, పాల కోసం, వ్యవసాయ పనుల కోసం లంకలలోనికి వెళ్లే రైతులను ఎలర్ట్ చేసి, ఎవ్వరూ లంకలోకి వెళ్లకుండా చూడాలని, అన్ని గ్రామాలలో టాం టాం ద్వారా హెచ్చరించాలని, ఎక్కడా ప్రాణ, జంతువుల నష్టం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని పునరావాసం ఏర్పాటు చేసిన చోట, తగిన సౌకర్యాలు ఉండేలా చూడాలి అని, ప్రజా ప్రతినిధులను నాయకులను సమన్వయం చేసుకొంటూ ప్రజలను అప్రమత్తం చేయాలి అని ఎంపిడిఓ నాతి బుజ్జి, తహశీల్దార్, టి రాజేశ్వరరావు తెలియజేశారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళ

విశాలాంధ్ర - కొవ్వూరు : జిల్లా ఉపాధి కల్పనా, స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. జాబ్ మేళాలో ఎంజి మోటార్స్, హెట్రో డ్రగ్స్, ముత్తూట్ ఫైనాన్స్ తను సంస్థల ద్వారా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నారని కొవ్వూరు నియోజవర్గం నుండి పెద్ద సంఖ్యలో జాబ్ మేళాకు నిరుద్యోగులు హాజరయ్యారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సునీత తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధి కల్పన అధికారి హరిచంద్ర ప్రసాద్,అడిషనల్ డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పెరుమళ్ళరావు,డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత తదితరులు పాల్గొన్నారు.

## చిన్న కోరుమిల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - కపిలేశ్వర పురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం చిన్న కోరుమిల్లి గ్రామంలో ఉచిత నేత్ర చికిత్స శిబిరాన్ని సీతారామ కాపు కళ్యాణ మండ పంలో బులుసు కనకదుర్గా, వెంకట సత్య సుబ్రమణ్య శర్మ జ్ఞాప కార్థం నిర్వహించారు. వారి కుటుంబం సంయుక్త ఆధ్వర్యంలో చెన్నై శంకర నేత్రాలయ కంటి వైద్యశాల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని వేగుళ్ళ జోగేశ్వరరావు, మండపేట నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్‌ఛార్జ్ వేగుళ్ళ లీలా కృష్ణ కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కుమార్తె విజయ, అల్లుడు మెహర్ చాంద్ లంక కుటుంబ సభ్యులు తీసుకున్న ఈ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్ణయం అభినందనీయమన్నారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిబిరంలో ఆరు రోజుల పాటు టెస్టులు, చివరి మూడు రోజులు ఆపరేషన్లు నిర్వహిస్తా రన్నారు. సీనియర్ డాక్టర్లతో కంటికి సంభందించిన శస్త్ర చికిత్సలు మొబైల్ ఆపరేషన్ వెహికల్ లోనే నిర్వహించనున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆచంట సత్య నారాయణ, సుంకర బుజ్జి, కొండిశెట్టి నాగేశ్వరరావు, మోటుపల్లి బాపిరాజు, భద్రం, నాగరాజు, సుంకర మణికంఠ పాల్గొన్నారు.

## పశు సంపద వృద్ధి చేసేందుకే పశు వైద్య శిబిరాలు

- డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు
- త్వరలోనే మండలానికి పశు వైద్య అధికారి నియామకం

విశాలాంధ్ర - సీతానగరం: పశు సంపద వృధి చేసేందుకే పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ ఎమ్ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలో గల రాపాక గ్రామ పంచాయితీ పరిధిలో మంగళవారం పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జనసేన నా సేన నా వంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి ముఖ్య అతిథిగా గోమాతకు పూజలు నిర్వహించి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల్ మిషన్లో భాగంగా అన్ని మండలాలలో ఒక గ్రామం చొప్పున ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాలు నిర్వహిస్తామని అన్నారు. సీతానగరం మండలానికి త్వరలోనే పశు వైద్యుడు నియమిస్తామని, రైతులు ఎవరు అధైర్య పడవద్దు అని అన్నారు. ఇంత వరకూ బాగానే ఉన్నా ఉదయం 8 గంటలకు ప్రారంభం కావాల్సిన పశువైద్య శిబిరం 11 గంటలకు ప్రారంభం కావడంపై రైతులు అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభావతి, పశు వైద్యులు రాజశేఖర్, వనిత, వి ఐ మునిద్రా, ఆదిలక్ష్మి, సర్పంచ్ గనిన బ్రహ్మజి, కూటమి పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు

## జిల్లా విద్యాశాఖ అధికారి హైస్కూల్ తనిఖీ

విశాలాంధ్ర - కరప : కరప మండలం పెద్దాపురపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి పి రమేష్ మంగళవారం తనిఖీచేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ఎస్ శ్రీనివాస్‌కు సూచనలు సలహాలు అందించారు. పదో తరగతి విద్యార్థుల సిలబస్, ఉపాధ్యాయుల హాజరు పట్టి స్కూల్లో ఉన్న మౌలిక సదుపాయాలు కోసం ఆరా తీశారు. డీఈవో రమేష్ వెంట మండల విద్యాశాఖ అధికారి పి సత్యనారాయణ ఉన్నారు. హైస్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో రివ్యూ నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏమైనా అవసరాలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని డీఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వరదల వల్ల నష్టపోయిన ప్రతీ ఒక్కరికీ న్యాయం చేయాలి : సీపీఐ ఎమ్ఎల్

**విశాలాంధ్ర - సీతా నగరం:** వరదల వల్ల నష్టపో యిన ప్రతీ ఒక్కరికీ న్యాయం చేయాలని సీపీఐఎమ్ఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీర బాబు అన్నారు. మంగళవారం సీతానగరం మండలంలోని పార్టీ కార్యాలయంలో వీరబాబు విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ వరదల వల్ల నష్ట పోయిన ప్రతీ ఒక్కరికీ న్యాయం చేయాలని కోరారు. అకాల వరదల వల్ల కూలీలు, చిన చితక వ్యాపారం చేసుకునే వారు అధికంగా నష్ట పోయారని అన్నారు. వరదల సహాయక చర్యలు ప్రతీ ఒక్కరూ పాలు పంచుకొని మునుపెన్నడూ లేని విధంగా సహాయక చర్యలు చేశారని అన్నారు. అలాగే వరదల వల్ల నష్ట పోయిన ప్రతీ కుటుంబానికి రూ.5 లక్షలు, మరణించిన వ్యక్తులకు రూ.25 లక్షల నష్ట పరిహారం క్రింద ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయ కులు చిట్టి స్వామి, నాగరాజు, పలివెల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు జాగ్రత్తలతో జర్వాలు నివారించవచ్చు

**విశాలాంధ్ర - నిడద వోలు :** వర్షాకాలంలో విష జ్వరాల ప్రొపల్లె అవకాశం ఉందని, ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని డాక్టర్ తాళ్లూరి ఆంద్రూ అన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి ఆదేశాల మేరకు తాడి మళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాలలో ఫీవర్ సర్వేలు నిర్వహిస్తున్నారు. కాట కోటేశ్వరంలో మంగళవారం ఫీవర్ సర్వే నిర్వహించి మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు.మెడికల్ క్యాంపు నందు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. జ్వర పీడుతలకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా "ఆంద్రూ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పై అవ గా హన కలిగించారు. ప్రతి శుక్రవారం గ్రామాల్లో డ్రై డే ఫ్రైడే నివాసిత ప్రాంతాలు పొడిగా ఉండేటట్లు జాగ్రత్తలు వహించాలన్నారు.ఈ కార్య క్రమంలో ఎంపిహెచ్ఓ దేవదాసు, పిహెచ్ఎన్ ఎమేలీ యమ్మ, హెచ్ వి రత్నమ్మ, ఏఎన్ఎం వేణమ్మ, వైద్యసిబ్బంది ఆశాలు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి రూ.50 వేలు జరిమానా : ఎస్పీ

**విశాలాంధ్ర - ఏలేశ్వరం :** కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఏలేశ్వరం పట్టణంలో పది రోజులుగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై రామలింగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఎస్సై మాట్లాడుతూ పదిరోజులుగా ఏలేశ్వరం పట్టణంతోపాటు మండ లంలోని వివిధ ప్రదేశాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిం చినట్లు ఆయన తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుపడిన వారిపై కేసులు నమోదు చేసి వారిని మంగళవారం ప్రత్తిపాడు కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ వారు ఐదుగురుకి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ50 వేల రూపాయలు జరిమానా విధించి నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోంటామని ఎస్సై హెచ్చరించారు.

# దొంగతనం కేసులో నలుగురు అరెస్టు

- సుమారు రూ.95 లక్షలు విలువైన ఆభరణాలు స్వాధీనం
- ఎస్పీ విక్రాంత్ పాటిల్

**విశాలాంధ్ర - బ్యూరో, కాకినాడ :** కాకినాడ పరిసర ప్రాంతాలలో 21 దొంగతనం కేసుల్లో సంబంధం ఉన్న నలుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి సుమారు రూ.94 లక్షల 70 వేల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లుగా కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పార్టీలు తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో విలేకరులతో ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ, టేకుమూడి శ్రీకాంత్, వల్లి లక్ష్మణ్ కుమార్, వల్లి రాము కుమార్, మొండి మహేశ్వర దుర్గాప్రసాద్ ఒక ముఠాగా ఏర్పడి కాకినాడ జిల్లాలో వివిధ ప్రాంతాలలో తాళం వేసిన ఇళ్ళను గుర్తించి, రెక్కీ నిర్వహించి, ఆ ఇళ్లల్లో దొంగతనం పాల్పడే వారిని ఎస్పీ తెలిపారు. కాకినాడ డీఎస్పీ రఘువీర్‌విష్ణు, అడిషనల్ ఎస్పీ ఎన్‌జేవి భాస్కరరావు సలహాలతో, సూచనలతో సర్పవరం ఇన్‌స్పెక్టర్ పెద్దిరాజు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ కృష్ణ, సిసిఎస్ఎస్ఐ ప్రతాప్ మరియు సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వీరిని అరెస్టు చేసినట్టుగా ఎస్పీ తెలిపారు. 21 కేసుల్లో దొంగలించబడిన ఒక కోటి నలభై నాలుగు లక్షల ఇరువది నాలుగు వేలు రూపాయలకు, 94 లక్షల 70000 వేల విలువైన బంగారము, వెండి వస్తువులను, ఓ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లుగా విక్రాంత్ పాటిల్ తెలిపారు. సర్పవరం గ్రామ శివారు భవన్ నారాయణ స్వామి గుడి సమీపంలో ముద్దాయి అరెస్ట్ చేసి వారు నుండి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలి పారు. ఈ సందర్భంగా ఈ కేసులో చాకచక్యంగా వ్యవ హరిస్తూ ముద్దాయిని అరెస్ట్ చేసిన అడిషనల్ ఎస్పీ ఎన్‌జివి భాస్కరరావు, కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీరామ కోటేశ్వరరావు, సర్ప వరం సిఐ బి పెద్దిరాజు, క్రైమ్ ఇన్స్పెక్టర్ వి కృష్ణ, సర్ప వరం సబ్ ఇన్స్పెక్టర్ కె రామకృష్ణమూర్తి, క్రైమ్ సబ్ ఇన్స్పెక్టర్ ప్రతాప్ సిబ్బంది ఏఎస్ఏ బలరాము, రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సత్తిబాబు, రాజు, గణేష్ పోలీస్ కానిస్టేబుల్స్ వెంకటరత్నం, క్రైమ్ సిబ్బంది గోవిందరాజు, ధనరాజు సత్యమూర్తి, చిన్న, వర్మ కానిస్టేబుల్ మౌళి, వర్మ ఐటీ కేర్ కానిస్టేబుల్ స్వామిని ఎస్పీ విక్రాంత్ పాటిల్ వీరిని ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రగతిలో 'ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయబిలిటీ' ప్రారంభం

**విశాలాంధ్ర - గండేపల్లి :** గండేపల్లి మండలం సూరంపాలెం ప్రగతి ఇంజనీ రింగ్ కళాశాలలో మంగళవారం ఇన్ఫో సిస్ ఫౌండేషన్ ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయిబిలిటీని ప్రారంభించారు. అడ్వాన్స్‌డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్కిల్స్‌తో యువతను శక్తివంతం చేయడం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల, ఇన్ఫోసిస్ ఫౌండేషన్, అకాడమీ సహకారంతో, ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్‌పై ప్రత్యేక దృష్టితో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయబిలిటీని ప్రారంభించింది. ఈ 124-గంటల ఇంటెన్సివ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగంలో డిమాండ్‌కు తగ్గ నైపుణ్యాలను విద్యార్థులకు అందించడం ద్వారా ఉపాధిని మెరుగుపరచడానికి రూపొందించబడింది. ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐసీటీ అకాడమి అధినేత దినకర్ రెడ్డి హాజరై విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగించారు. సంబంధిత సాంకేతికతలలో అనుభవాన్ని పొందేందుకు, ఉద్యోగ విపణిలో వారిని వేరు చేయడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విద్యార్థులను ప్రోత్సహించారు.

## క్షణికావేశంలో జీవితాన్ని నాశనం చేసుకోకూడదు

**విశాలాంధ్ర - గండేపల్లి :** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ లియో క్లబ్ , గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన "జీవితం చాలా విలువైనది - ఆత్మహత్యల నివారణ చర్యలు" అనే అంశం పై అవగాహన సదస్సు విజయవంతంగా విజ్ఞానదాయకంగా జరిగిందని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాస రెడ్డి తెలిపారు. అంగలూరు ప్రభుత్వ డైట్ కాలేజీ సైకాలజీ విభాగం సీనియర్ లెక్చరర్ డా పి వినయ కుమార్, రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు, యువత అనాలోచితంగా ఆవేశంలో తమ విలువైన ప్రాణాలు బలి తీసుకోవ డం ప్రతి రోజు వార్తా పత్రికలలో మనం చూస్తున్నామని అటువంటి ఆలోచనల నుంచి బయటకు వచ్చి నిర్దిష్టమైన లక్ష్యం ఏర్పరుచుకుని ఆ లక్ష్య సాధనకు కృషి చేస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్స లర్ డా ఎంబి శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ డా ఎస్ రమాశ్రీ, రిజిస్ట్రార్ డా జి సురేష్ గ్రంథాలయ విభాగాధిపతి అశోక్ కుమార్, స్పందన ఈదా ఇంటర్నేషనల్ సంస్థ కాకినాడ జిల్లా సభ్యులు తోటకూర గంగాధర్, లియా క్లబ్ ఇంచార్జి నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయుడు అరెస్టు దేశ చరిత్రలో చీకటి రోజు

**విశాలాంధ్ర - కొవ్వూరు :** చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన జగన్మోహన్ రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి కె యస్ జవహర్ అన్నారు. సెప్టెంబర్ తొమ్మిదవ తేదీ 2023 ఆనాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు అరెస్టు చేసి సంవత్సర కాలం పూర్తి కావడం పట్ల మంగళవారం కొవ్వూరు పట్టణంలోని తూర్పు గోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సామ్యూల్ జవహర్ విలేకరుల సమావేశం ఈ సందర్భంగా కె.ఎస్ జవహర్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అరెస్టు దేశ చరిత్రలో చీకటి రోజు అని అభివర్ణించారు. చంద్రబాబును అక్రమ కేసులలో జగన్మోహన్ రెడ్డి అరెస్టు చేసి జైలుకు పంపితే 70 దేశాలలో ఉద్యమం రేకెత్తున విధానం దేశ చరిత్రలో ఎక్కడ జరగలేదన్నారు. భవిష్యత్తులో జగన్ మోహన్ రెడ్డి మళ్ళీ రాజకీయాల్లో కనిపించకుండా ప్రజలు చంద్రబాబును అరెస్టు చేసిన రోజులను గుర్తించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.

## నాలుగో రోజు చవితి ఉత్సవాలు

**విశాలాంధ్ర-దేవరపల్లి:** దేవరపల్లి మెరకవీధి వినాయకుని ఆలయం వద్ద మంగళవారం నాలుగో రోజు చవితి ఉత్సవంలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక పురోహితులు పెదసనగంటి సాయిబాబు ఆధ్వర్యంలో విశేష సంఖ్యలో భక్తులు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామివారికి గరిక తో పూజ నిర్వహించారు . పడాల సాంబశివరావు ఇందిరా ప్రియదర్శిని దంపతులు, కుప్పాల చంద్రకాంత్ రాధా దంపతులు పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ శనివారం ఆలయం వద్ద లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్నామని తెలిపారు. హోమానికి భక్తులు తరలిరావాలని కోరారు . హోమంలో పాల్గొనే భక్తులు కమిటీ వారిని సంప్రదించాలని కోరారు

# సీపీఐ విరాళాల సేకరణ

**విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం :** వరద బాధితులను ఆదుకునేందుకు విరివిగా విరాళాలివ్వాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు.వరద విపత్తు నుంచి ప్రజలను రక్షించడానికి మేము సైతం అంటూ ప్రజలంతా రాజకీయాలకు అతీతంగా స్పందించి స్వచ్ఛందంగా తోచినంత సహాయం అందించాలని ఆయన కోరారు. మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం జంగారెడ్డిగూడెం పట్టణంలో విరాళాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా విజయవాడ నగర ప్రజలు వరదలకు విలవిల్లాడిపోయారని, ధనిక పేద అనే తారతమ్యం లేకుండా ప్రజలంతా కట్టుబట్టలతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బయటపడిన ఎన్నో హృదయ ఉదారక సంఘటనలు చోటు చేసుకున్నాయని అన్నారు. జాతీయ విపత్తుగా కేంద్రం ప్రకటించి పదివేల కోట్లు గ్రాంట్ ఇవ్వాలని, సర్వస్వం కోల్పోయిన బాధితులకు జరిగిన నష్టాన్ని శాస్త్రీయ అంచనాలు వేసి నష్ట పరిహారాన్ని ప్రభుత్వం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జంగారెడ్డి గూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు, సహాయ కార్యదర్శి కుంచె వసంతరావు, మండల కమిటీ సభ్యులు గొలిమే బాలయేసు, పొడపాటి ఘటోత్కచుడు, కంకిపాటి రామారావు, భూదే ఆశీర్వాదం తాళ్లూరి నాగరాజు, హనుమంతు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**చింతలపూడిలో :** చింతలపూడి సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలో రూ. 25,800 విరాళాలుగా సేకరించిన మొత్తాన్ని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్యకు మంగళవారం సీపీఐ పట్టణ కార్యాలయంలో సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య అందజేశారు. వరద బాధితులకు సహాయం చేసిన సిపిఐ మండల కమిటీకి,ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఎం. వసంతరావు, మండల సహాయ కార్యదర్శులు పుల్లూరు సోమశేఖర్, తొర్లపాటి బాబు, ఎస్.కె.మస్తాన్, ముల్లగిరి నాగేశ్వరరావు, నరసింగ రామారావు, తలారి గంగరాజు, రైతు సంఘం నాయకులు తక్కెలపాటి ప్రసాద్ రావు, తాడిగడప మాణిక్యాలరావు పాల్గొన్నారు.

**భీమవరం :** తుఫానులు,వరదలతో సర్వసం కోల్పోయిన వరద బాధితులను ఆదుకునేందుకు విరివిగా విరాళాలిచ్చి సహకరించాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. సీపీఐ ఇచ్చిన రాష్ట్ర వ్యాపిత పిలుపులో భాగంగా మంగళవారం భీమవరం పట్టణంలో వరద బాధితుల సహాయార్థం సీపీఐ ఆధ్వర్యంలో నిధి సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ పదేళ్ల కాలంలో కనీవినీ ఎరుగని రీతిలో విజయవాడను వరదలు ముంచెత్తాయన్నారు. వరదల కారణంగా విపరీతంగా ఆస్తి నష్టం,ప్రాణ నష్టం వాటిల్లిందన్నారు. లక్షలాది మంది ప్రజలు సర్వస్వాన్ని కోల్పోయి కట్టుబట్టలతో దిక్కుతోచని స్థితిలో బాధితులు సహాయం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. మానవతా దృక్పథంతో ప్రజలు తమకు తోచిన రీతిలో సహకారం మం దించి బాధితులను ఆదుకోవాలని భీమారావు కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాస రావు, ఎం.లక్ష్మీపతి, కోన గొల్లయ్య, కొడవర్తి రమేష్, దొమ్మేటి నాగరాజు, రాజు పాల్గొన్నారు.

## వరద బాధితుల సహాయార్థం ఎంపీ మహేష్ విరాళం

**విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ రూ.25 లక్షల చెక్కు అందచేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద సమయంలో విజయవాడ వాసులకు అం దగా అందరూ నిలవాలన్నారు. తన వంతుగా 25 లక్షలు అందజేసినట్లు తెలిపారు. విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. కైకలూరు నియోజ కవర్గం కలిదిండి మండలం తాడినాడలోని శివాలయంలో స్థానిక శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక గ్రామ ప్రజలను కలిసి వరద పరిస్థితుల గురించి చర్చించారు. గ్రామస్తులు తమకు పంటు (పడవ) కావా లని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

### ఎమ్మెల్యే సత్య ప్రభ

**విశాలాంధ్ర - ప్రత్తిపాడు :** తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను గుర్తించి వాటి నివారణ చర్యలు త్వరితగతిన చేపట్టాలని అధి కారులను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరు పుల సత్యప్రభ ఆదేశించారు. మండలంలోని వివిధ గ్రామాలలో వర్షాలతో ముం పునకు గురైన పంట పొలాలు, గండ్లు, ఎమ్మెల్యే సత్య ప్రభ పరిశీలించారు. ఇ గోకవరం వద్ద సుబ్బారెడ్డి సాగర్ ఏటి కాలువ వంతెన, వేములపాలెం వద్ద వంతెన, మరియు పి జగన్నాథపురంలో వర్షాలకు గండి పడిన ఏటి కాలువను ఎమ్మెల్యే ఎన్డీఏ శ్రేణులు, నీటిపారుదల శాఖ అధికారులు డిఇ పోచారావ్, జెఈ ఇబ్రహీంతో మరియు రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**విశాలాంధ్ర - ఏలేశ్వరం :** ఏలేశ్వరం అప్పన్నపాలెం బ్రిడ్జిని స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ మేరకు ఏలేరు నుండి 26 వేల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకి విడుదల చేయడంతో మండలంలో అప్పన్నపాలెం వంతెన పై నుండి నీరు ప్రవహించడంతో కాజ్ వే పూర్తిగా దెబ్బతింది. ఈ వంతెన నాలుగేళ్ల క్రితమే కూలిపోవడంతో అప్పటి నుండి వాహనాలు రాకపోకలు కొనసాగక పోయినప్పటికి పాదచారులు ఈ వంతెన పై రాకపోకలు కొనసాగించేవారని తెలిపారు. అయితే వరద నీటి ఉధ్రుతికి ఈ వంతెన పూర్తిగా మునిగి పోయిందని, వంతెన పై నుండి సుమారు 7 అడుగుల ఎత్తులో నీరు ప్రవహిస్తుండటంతో ఎమ్మెల్యే సత్య ప్రభ అధికారులు ఎన్డీఏ శ్రేణులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. వంతెన పై నుండి నీరు భారీగా ప్రవహిస్తుండటంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాకపోకలు కొనసాగకుండా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకం మెనూలో మార్పులు

### కలెక్టర్ మహేష్‌కుమార్

**విశాలాంధ్ర - అమలాపురం :** స్థానిక అభిరుచులు అవసరాలకు అనుగుణంగా పాఠశాలలలోని మధ్యాహ్న భోజన మెనూను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోన సీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్ గోదావరి భవన్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలు, విద్యార్థులు, అధికారులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ మహేష్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక అభిరుచులు అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలోని మెనూను తయారు చేయాలని ఆ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై అభిప్రాయాలు సేకరించి నివేదిక పంపాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. వేరువేరు ప్రాంతాల్లో ఆహారపు అలవాట్లు వేరుగా ఉంటాయని.రాష్ట్రమంతటా ఒకే రకమైన ఆహారం కాకుండా, ఎక్కు వగా ఇష్టపడి తినే ఆహారాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. న్యూట్రిషన్ మార్గ దర్శకాల ప్రకారం స్థానికంగా దొరికే కూరగాయలు, పప్పులు తదితరాలను మెనూలో చేర్చాలన్నారు. ప్రస్తుతం అందిస్తున్న ఆహార పదార్థాలను పిల్లలు ఇష్టంగా తింటున్నారా లేదా అని చర్చించి పిల్లలు ఇష్టపడని ఆహార పదార్థాల స్థానంలో కొత్తవి చేర్చాలన్నారు. ఏ సీజన్లో ఏ కూరగాయలు పప్పు దినుసులు అందుబాటులో ఉంటాయో రైతుబజార్ల ఎస్టేట్ అధికారులు వివరాలు ఇచ్చి చర్చించాలన్నారు. స్థానిక అభిరుచులకు అనుగుణంగా ఆహారాన్ని అందిస్తే ఆహారం వృధా అవ్వదని, జిల్లాలో సుమారుగా ఒక లక్ష మంది పిల్లలు మధ్యాహ్న భోజనం తింటున్నారని. స్థానికంగా లభించే, పిల్లలకు ఇష్టమైన ఇష్టమైన పౌష్టికాహారాన్ని అందించే దిశగా మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు క్షుణ్ణంగా చర్చించి అందరూ అభిప్రాయాలు సేకరించి నివేదిక ఇవ్వాలన్నారు. నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి ఆమోదం తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కమల కుమారి, మార్కెటింగ్ శాఖ అధికా రులు, ఎంఈఓలు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు దెబ్బతిన్న శాఖల వివరాలు ఇవ్వండి

### ఎంపీడీఓ విజయలక్ష్మి

**విశాలాంధ్ర - ఉంగుటూరు :** భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న అన్ని శాఖల వివరాలను గ్రామాల వారీగా ఇవ్వాలని ఉంగుటూరు మండల ప్రత్యేక అధికారి విజయ లక్ష్మీ అన్నారు. మంగళవారం ఉంగుటూరు మండల పరిషత్ హాలులో తుఫాను వల్ల దెబ్బతిన్న వివరాలు గురించి, వినాయక నిమజ్జనం గురించి మండల అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. విగ్రహాలను తీసుకెళ్లే రోడ్డుల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని, అప్రమత్తంగా ఉండాలన్నారు. నిమజ్జనం రోజు ప్రశాంతంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలో అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక అధికారి విజయలక్ష్మి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉంగుటూరు ఎంపీడీఓ ప్రేమాన్విత మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యం పట్ల పంచాయితీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతిరోజు గ్రామాలను శుభ్రపరిచి, చెత్త చెదారాలను డంపింగ్ యార్డ్ కు తరలించాలన్నారు. డ్రైనేజీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. ఉంగుటూరు ఇన్చార్జి తహసిల్దార్ బొడ్డేపల్లి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంట పొలాల నష్టం అంచనాలు వీఆర్వోలు పారదర్శక పాటించి, ఖచ్చితమైన వివరాలను ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ, పంచాయితీ, వైద్య, విద్యుత్తు, ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.